సాక్షి
విశాఖపట్నం

మంగళవారం । 5 । సెప్టెంబర్ । 2023

I



అర్జీల సత్వర పరిష్కారం

జగనన్నకు చెబుదాం అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ మల్లికార్జున అధికారులను ఆదేశించారు. IIలో



తెలుగును ప్రేమిద్దాం..

తెలుగు భాష ప్రాధాన్యాన్ని భావితరాలకు తెలియజేయాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. IIలో



'ఖుషి'గా రూ.కోటి కానుక

తన సంపాదన నుంచి అభిమానులకు రూ.కోటి విరాళం అందిస్తానని హీరో విజయ్ దేవరకొండ ప్రకటించారు. IIలో

ఆకాశ వీధిలో..



సాక్షి, విశాఖపట్నం : విశాఖపట్నం అంతర్జాతీయ విమానాశ్రయానికి ప్రయాణికుల తాకిడి పెరుగుతోంది. ప్రయాణికుల రద్దీతో కోవిడ్‌కు ముందు నాటి పరిస్థితికి చేరుకుంటోంది. ఈ ఆర్థిక సంవత్సరం ఆరంభమైన ఏప్రిల్ నుంచి జూలై వరకు ఈ ఎయిర్‌పోర్టు నుంచి మొత్తం 10,37,710 మంది ప్రయాణికులు (దేశీయ, అంతర్జాతీయ) రాకపోకలు సాగించారు. గత సంవత్సరం ఏప్రిల్–జూలై మధ్య నాలుగు నెలల్లో 7,75,100 మంది ప్రయాణించారు. వీరిలో దేశీయ ప్రయాణికులు 7,54,966 మంది, విదేశీ ప్రయాణికులు 20,084 మంది ఉన్నారు. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకు చూస్తే దేశీయ విమానాల్లో ప్రయాణించిన వారు 10,13,518కి, అంతర్జాతీయ విమానాల్లో ప్రయాణికులు 24,192కి పెరిగారు.

- విశాఖ విమానాశ్రయానికి పెరుగుతున్న రద్దీ
- ఏప్రిల్–జూలై మధ్య 10.37 లక్షల మంది ప్రయాణం
- 7,045 నుంచి 7,184కి పెరిగిన డొమెస్టిక్ విమాన సర్వీసులు

అలాగే దేశీయ (డొమెస్టిక్) విమానాల రాకపోకలు కూడా 7,045 నుంచి 7,184కి పెరిగాయి. అయితే రాకపోకలు సాగించిన అంతర్జాతీయ విమాన సర్వీసులు 170 నుంచి 164కి స్వల్పంగా తగ్గాయి. కానీ ఈ నాలుగు నెలల్లో అంతర్జాతీయ విమానాల్లో ప్రయాణించిన వారి సంఖ్యలో మాత్రం పెరుగుదల కనిపించింది. కోవిడ్‌కు ముందు ఈ విమానాశ్రయం నుంచి నెలకు సగటున 2.8 లక్షల మంది రాకపోకలు సాగించేవారు. కోవిడ్ తర్వాత రెండేళ్ల పాటు విమాన ప్రయాణికుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. నెలకు 1.5 లక్షల మంది ప్రయాణించడం గగనమయ్యేది. మళ్లీ కొన్ని నెలల నుంచి ఈ ప్రయాణికుల సంఖ్య పుంజుకుంటోంది. ఇప్పుడది నెలకు 2.6 లక్షలకు పెరిగింది. మరికొద్ది నెలల్లో ఈ సంఖ్య కోవిడ్‌కు ముందు నాటి పరిస్థితికి చేరుకుంటుందని విమానాశ్రయ వర్గాలు అంచనా వేస్తున్నాయి. కాగా ఈ ఎయిర్‌పోర్టు ఏడాదికి 3.5 మిలియన్ల ప్రయాణికుల రాకపోకల సామర్థ్యాన్ని కలిగి ఉంది. ప్రస్తుతం 2.5 మిలియన్ల మంది రాకపోకలు సాగిస్తున్నారు. ముందుముందు ఈ ప్రయాణికుల సంఖ్య మరింత పెరుగుతుందని విశాఖ అంతర్జాతీయ విమానాశ్రయం డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి 'సాక్షి'కి చెప్పారు. ఈ ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల సౌకర్యాలను పెంచుతున్నామని తెలిపారు.

ఏప్రిల్- జూలై మధ్య ప్రయాణాలు సాగించిన వారు

	ఈ ఏడాది	గతేడాది
మొత్తం ప్రయాణికులు	10,37,710	7,75,100
దేశీయ ప్రయాణికులు	10,13,518	7,54,966
అంతర్జాతీయ ప్రయాణికులు	24,192	20,084

కార్గో రవాణాలోనూ..

మరోవైపు కార్గో రవాణాలోనూ ఈ విమానాశ్రయం ఊపందుకుంటోంది. కోవిడ్ ప్రభావంతో రెండేళ్లకు పైగా కార్గో రవాణా సన్నగిల్లింది. కానీ కొన్నాళ్లుగా ఇది మళ్లీ పుంజుకుంటోంది. కోవిడ్ సమయంలో రోజుకు ఏడెనిమిది టన్నుల సరకు రవాణా కష్టతరమయ్యేది. ఇప్పుడు రోజుకు 12 నుంచి 15 టన్నుల వరకు కార్గో రవాణా జరుగుతోంది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి జూలై వరకు నాలుగు నెలల్లో ఈ ఎయిర్‌పోర్టు నుంచి 1,432 టన్నుల సరకు రవాణా జరిగింది. ఈ విమానాశ్రయం నుంచి దేశంలోని వివిధ ప్రాంతాలకు రొయ్యలు, రొయ్య పిల్లలతో పాటు ఫార్మా ఉత్పత్తులు, అత్యవసర మందులు, దుస్తులు, ఆటోమొబైల్స్, నావికాదళానికి సంబంధించిన వస్తువులు, సరకులు, పరికరాలతో పాటు సాధారణ సరకు రవాణా కూడా జరుగుతోంది. వీటిలో రొయ్యలు, ఫార్మా ఉత్పత్తులు, దుస్తులు ఎక్కువగా రవాణా అవుతుంటాయి.

ఎయిర్‌పోర్టు నుంచి ప్రతి నెలా రాకపోకలు సాగించేవారు	2.6 లక్షలు
ఈ ఏడాది ఏప్రిల్– జూలై మధ్య సరకు రవాణా	1,432 టన్నులు

క్రూయిజ్ డెస్టినేషన్‌గా విశాఖ



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి శర్బానంద్ సోనోవాల్, చిత్రంలో రాష్ట్ర మంత్రి అమర్‌నాథ్, మేయర్ హరివెంకటకుమారి, ఎంపీలు ఎంవీవీ, సత్యవతి, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్

- క్రూయిజ్ టెర్మినల్ ప్రారంభోత్సవం
- రాష్ట్ర మంత్రి అమర్‌నాథ్‌తో కలిసి టెర్మినల్‌ను ప్రారంభించిన కేంద్ర మంత్రి శర్బానంద్

దొండపర్తి: విశాఖ పర్యాటకం కొంత పుంతలు తొక్కనుంది. అంతర్జాతీయ క్రూయిజ్ టెర్మినల్ ప్రారంభోత్సవంతో ప్రపంచ పర్యాటకులకు కేంద్రంగా మారనుంది. సిటీ ఆఫ్ డెస్టినీగా ఉన్న విశాఖ భవిష్యత్తులో క్రూయిజ్ పర్యాటకుల గమ్యస్థానంగా నిలవనుంది. సరికొత్త పర్యాటక అనుభూతిని పంచేందుకు విశాఖ పోర్టులో క్రూయిజ్ టెర్మినల్ అందుబాటులోకి వచ్చింది. ఈ క్రూయిజ్ టెర్మినల్ ప్రారంభోత్సవాన్ని పోర్టు అధికారులు సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన కేంద్ర పోర్టులు, షిప్పింగ్ శాఖ మంత్రి శర్బానంద్ సోనోవాల్, రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌లకు మేళ తాళాలతో స్వాగతం పలికారు. ముందుగా సీఐఎస్‌ఎఫ్ సిబ్బంది గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం రూ.96 కోట్లతో నిర్మించిన ఈ టెర్మినల్‌ను ప్రారంభించారు. అలాగే పోర్టులో స్టాక్ యార్డుల ద్వారా ఉత్పన్నమయ్యే కాలుష్యాన్ని నియంత్రించేందుకు 33.8 కోట్లతో నిర్మించిన కవర్డ్ స్టోరేజ్ యార్డులను, 666 ట్రక్కులను పార్కింగ్ చేసుకొనే సౌలభ్యంతో రూ.36.05 కోట్లతో ట్రక్ పార్కింగ్ టెర్మినల్‌ను ప్రారంభించారు. అదే విధంగా పోర్టులో ఓఆర్ 1, 2, 3 బెర్తుల ఆధునీకరణ, సామర్థ్య విస్తరణతో పాటు రూ.167.66 కోట్ల కొత్త పనులకు ప్రారంభోత్సవం చేశారు. అనంతరం నిర్వహించిన సభలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ విశాఖ సుందర నగరమని, క్రూయిజ్ టెర్మినల్ రాకతో పర్యాటక రంగంలో విశాఖ అంతర్జాతీయ ఖ్యాతిని మరింత ఆర్జిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశంలో ప్రముఖ నగరాల్లో విశాఖ ఒకటని పేర్కొన్నారు. విశాఖ అభివృద్ధిలో పోర్టు పాత్ర కీలకమని చెప్పారు. విశాఖలో కాలుష్య నియంత్రణకు కూడా పోర్టు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని, ఇందులో భాగంగా కవర్డ్ స్టోరేజ్ యార్డులను నిర్మించినట్లు తెలిపారు.

క్రూయిజ్ డెస్టినీగా విశాఖ : సిటీ ఆఫ్ డెస్టినీగా ఉన్న విశాఖ భవిష్యత్తులో క్రూయిజ్ డెస్టినీగా కూడా మారుతుందని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ పేర్కొన్నారు. రాష్ట్ర పర్యాటకాభివృద్ధికి ఈ క్రూయిజ్ టెర్మినల్ మరింత దోహదంగా నిలుస్తుందన్నారు. ఈ టెర్మినల్ ద్వారా పర్యాటకులకు పూర్తి స్థాయిలో సేవలు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు రాష్ట్ర ప్రభుత్వం చేపడుతుందని చెప్పారు.

ఆర్థికాభివృద్ధికి ఊతం : ప్రపంచ పర్యాటకులను ఆకర్షించేందుకు ఈ క్రూయిజ్ టెర్మినల్ కీలకంగా నిలవనుందని విశాఖ పోర్టు అథారిటీ చైర్మన్ అంగముత్తు తెలిపారు. ఇది దేశ, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుందని వెల్లడించారు. పర్యాటకాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న చర్యలు సరికొత్త ఉద్యోగాలు, ఉపాధి కల్పనకు బాటలు పడతాయని చెప్పారు. పోర్టు డిప్యూటీ చైర్మన్ దుర్గేష్‌కుమార్ దుబే వందన సమర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, విశాఖ ఎంపీ ఎం.వి.వి.సత్యనారాయణ, అనకాపల్లి ఎంపీ బి.వి.సత్యవతి, రాజ్యసభ సభ్యుడు జీవీఎల్ నరసింహారావు, ఎమ్మెల్యేలు తిప్పలనాగిరెడ్డి, గణబాబు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ప్రధానితో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయురాలు ఉమాగాంధీ



ఉపాధ్యాయులతో ముచ్చటిస్తున్న ప్రధాని మోదీ

డాబాగార్డెన్స్: ప్రధాని నరేంద్రమోదీ సోమవారం రాత్రి ఢిల్లీలో జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన వారితో ఇంటరాక్ట్ అయ్యారు. నగరంలోని శివాజీపాలెం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉమాగాంధీ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

ఎస్ఐ దేహదారుఢ్య పరీక్షలకు 614 మంది హాజరు



పరుగు పోటీలో పాల్గొన్న పురుష అభ్యర్థులు

ఆరిలోవ: విశాఖ రేంజ్ పరిధిలో ఎస్ఐ ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో భాగంగా పురుష అభ్యర్థులకు దేహదారుఢ్య పరీక్షలు మళ్లీ ప్రారంభమయ్యాయి. కైలాసగిరి ఏఆర్ పోలీస్ మైదానంలో సోమవారం జరిగిన పరీక్షలకు 614 మంది హాజరయ్యారు. రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు గత నెల 25న ఇక్కడ దేహదారుఢ్య పరీక్షలు ప్రారంభమైన విషయం తెలిసిందే. గత నెల 29 వరకు కొన్ని బ్యాచ్‌లకు పరీక్షలు జరిగాయి. ఆగస్టు 30 నుంచి ఈ నెల 2 వరకు మహిళా అభ్యర్థులకు పరీక్షలు నిర్వహించారు. సోమవారం నుంచి మళ్లీ పురుష అభ్యర్థులకు పరీక్షలు మొదలయ్యాయి. 800 మందికి హాల్ టికెట్లు పంపించగా.. 614 మంది అభ్యర్థులు హాజరయ్యారు. రేంజ్ డీఐజీ ఎస్.హరికృష్ణ, విజయనగరం ఎస్పీ దీపికా ఎంపిక ప్రక్రియను పర్యవేక్షిస్తున్నారు.

50 మంది కార్యదర్శులకు మెమోలు



టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న ఏపీడీ గంగాధర్

మధురవాడ: జీవీఎంసీ జోన్–2(మధురవాడ) పరిధిలో వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న 50 మంది ఎమినిటీస్ సెక్రటరీలు విధుల్లో నిర్లక్ష్యం వహించినందున.. వారందరికీ మెమోలు జారీ చేస్తున్నట్టు జోనల్ కమిషనర్ కె.కనకమహాలక్ష్మి చెప్పారు. వివరాలివీ.. జోన్–2లో 5 నుంచి 13 వరకు గల 9 వార్డుల్లో 91 సచివాలయాలు ఉండగా 50 మంది ఎమినిటీస్ సెక్రటరీలు విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా.. జోన్–2 పరిధి జగనన్న కాలనీల్లో 23,407 మంది లబ్ధిదారులు ఉన్నారు. వీరిలో 2,219 మందికి జియో ట్యాగింగ్, 2,240 మందికి రుణాల కోసం బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేయించలేదు. ఈ పనుల్లో జోన్ వెనుకబడి ఉండడంతో సోమవారం ఉదయం 10 గంటలకు జోనల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు. అయితే సమీక్షకు కార్యదర్శులు సకాలంలో హాజరు కాలేదు. దీంతో వారిపై చర్యలు చేపట్టాలని జోనల్ కమిషనర్.. సూపరింటెండెంట్ అప్పలరాజును ఆదేశించారు. ఇందులో భాగంగా మెమోలు జారీ చేశారు. తర్వాత ఏపీడీ గంగాధర్ ఎమినిటీస్ సెక్రటరీలతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు.

నగరాన్ని కాలుష్యరహితంగా తీర్చిదిద్దుదాం



మాట్లాడుతున్న జిల్లా లీగల్ సెల్ అథారిటీ ప్రతినిధి వెంకటశేషమ్మ

డాబాగార్డెన్స్: నగరాన్ని కాలుష్య రహితంగా తీర్చిదిద్దేందుకు ఎన్జీవోలు, వీధి వ్యాపారులు సహకరించాలని జిల్లా లీగల్ సెల్ అథారిటీ ప్రతినిధి ఎం.వెంకటశేషమ్మ అన్నారు. నగరంలో కాలుష్య నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, జిల్లా లీగల్ సెల్ అథారిటీ, జీవీఎంసీ సంయుక్తంగా అవగాహన కార్యక్రమం నిర్వహించాయి. జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ఘన వ్యర్థాల నిర్వహణ, నిషేధిత ప్లాస్టిక్ నిర్మూలన తదితర అంశాలపై చర్చ జరిగింది. కాలుష్య నియంత్రణ మండలి పర్యావరణ ఇంజినీర్లు నాగిరెడ్డి, రామచంద్రమూర్తి, శ్రీనివాస్, ఏయూ పర్యావరణ విభాగం ప్రొఫెసర్ ఉదయ్‌భాస్కరరెడ్డి, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కచ్చితత్వంతో ఓటర్ల జాబితా రూపకల్పన

కలెక్టర్ మల్లికార్జున ఆదేశం



ఓటర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: ఎటువంటి తప్పిదాలకు అవకాశం లేకుండా కచ్చితత్వంతో ఓటరు జాబితాను రూపొందించాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున సిబ్బందిని ఆదేశించారు. ఇంటింటి ఓటరు సర్వే కార్యక్రమాన్ని సోమవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విశాఖ ఉత్తరలోని శ్రీకన్య థియేటర్ దగ్గర 128వ పోలింగ్ స్టేషన్ పరిధిలో సందర్శించారు. అక్కడి ప్రజలతో సర్వే గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం విశాఖ దక్షిణలోని అల్లిపురం, నీలమ్మ వేపచెట్టు దరి 63వ నంబర్ పోలింగ్ స్టేషన్ పరిధిలో ఇంటింటి ఓటరు సర్వేను పరిశీలించారు. ఆర్డీవోలు హుస్సేన్ సాహెబ్, భాస్కరరెడ్డి, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వరరావు, జోనల్ కమిషనర్ శివప్రసాద్, అధికారులు పాల్గొన్నారు.

నిబంధనల మేరకు సవరణలు

నిబంధనల మేరకు ఓటరు జాబితాలో చేర్పు, మార్పులు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అధికారులను ఆదేశించారు. అన్ని జిల్లాల కలెక్టర్లతో సోమవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. విశాఖ కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో ఓటర్ల జాబితాలో చేర్పు, మార్పు కోసం చేపట్టిన చర్యలను ఎన్నికల అధికారికి వివరించారు. డీఆర్వో ఎస్.శ్రీనివాస మూర్తి, ఆర్డీవోలు పాల్గొన్నారు.

ఏపీవీవీపీ ఆస్పత్రుల్లో పలు పోస్టుల భర్తీ

దరఖాస్తుకు ఈ నెల 9 ఆఖరు

మహారాణిపేట: ఆంధ్రప్రదేశ్ వైద్య విధాన పరిషత్(ఏపీవీవీపీ) ఆస్పత్రుల్లో పలు ఖాళీల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. ఆడియో మెట్రిషియన్, డెంటల్ టెక్నీషియన్, రేడియోగ్రాఫర్ పోస్టులను కాంట్రాక్ట్ పద్ధతిలో, థియేటర్ అసిస్టెంట్, రికార్డ్ అసిస్టెంట్, ఆఫీసు సబార్డినేట్ పోస్టులను అవుట్ సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేస్తామని కలెక్టర్ ఎ.మల్లికార్జున ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు అన్ని ధ్రువీకరణపత్రాల జిరాక్స్ కాపీలతో దరఖాస్తు చేయాలని సూచించారు. దరఖాస్తులను ఈ నెల 9వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఆస్పత్రుల సేవల సమన్వయ అధికారి వారి కార్యాలయం, గవర్నమెంట్ ఆస్పత్రి, పెందుర్తి కార్యాలయంలో అందజేయాలని జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయాధికారి టి.రమేష్ కిశోర్ తెలిపారు. విద్యార్హతలు, ఖాళీల వివరాలు, వయో పరిమితి, ఇతర వివరాలను https://visakhapatnam.ap.gov.inలో పొందుపరిచినట్లు చెప్పారు.

నిరుద్యోగులకు టోకరా

- విదేశాల్లో ఉద్యోగాల పేరుతో అమృత్ ఎంటర్‌ప్రైజెస్ మోసం
- సుమారు 70 మంది నుంచి రూ.కోటి వరకు వసూలు



గోడు వెళ్లబోసుకుంటున్న నిరుద్యోగులు

సీతమ్మధార: స్వీడన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ అమృత్ ఎంటర్‌ప్రైజెస్ నిరుద్యోగులకు టోకరా వేసింది. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా కడప తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 70 మంది నుంచి రూ.కోటి వరకు వసూలు చేసి బోర్డు తిప్పేసింది. దీంతో బాధితులు సోమవారం నాలుగో పట్టణ పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు తెలిపిన వివరాలివీ.. దొండపర్తిలోని టీఎస్ఎన్ కాలనీలో అమృత్ ఎంటర్‌ప్రైజస్ అనే సంస్థను ఏర్పాటు చేసి విదేశాల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ సోషల్ మీడియాలో ప్రచారం చేశారు. అది నమ్మి కార్యాలయానికి ఫోన్ చేసిన వారికి అర్హత గల ఉద్యోగాలు ఇప్పిస్తామని.. అందుకు డబ్బులు చెల్లించాలని మేనేజర్లు శాంతి, లలిత నమ్మించారు. అలాగే నీరజ్, సౌరభ్ తెరవెనుక ఉండి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, అనకాపల్లి, విజయవాడ, కడప, హైదరాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన సుమారు 70 మంది నుంచి రూ.లక్ష, రూ.2 లక్షలు చొప్పున రూ.కోటి వరకు ఆన్‌లైన్‌లో వసూలు చేశారు. డబ్బులు చెల్లించినట్లు మేనేజర్లు నిరుద్యోగులకు రసీదులతో పాటు అపాయింట్‌మెంట్ ఆర్డర్లు అందజేశారు. అయితే రోజులు గడుస్తున్నప్పటికీ ఉద్యోగాలు రాకపోవడంతో కొంతమంది దొండపర్తిలోని అమృత్ ఎంటర్‌ప్రైజెస్‌కు వెళ్లారు. కార్యాలయం మూసివేసి ఉండడంతో.. సంస్థ బోర్డు తిప్పేసినట్లు గ్రహించి ఆందోళనకు గురయ్యారు. దీనిపై బాధితులు నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మా..స్టార్లు



చీకటిలో చిరుదివ్వె... భవితకు బంగారు బాట చూపే కాంతిరేఖై... జ్ఞానోదయ ఉషస్సై.. మెరిసే ధ్రువతారై.. ప్రతి ఒక్కరి జీవితంలో ఓ చుక్కానిలా నిలిచే వ్యక్తి గురువు. అందుకే గురుదేవోభవ అని మన పెద్దలు ఉపాధ్యాయులకు ప్రత్యేక స్థానం కల్పించారు. శిష్యులను ఉత్తములుగా తీర్చిదిద్దాలని ప్రతిగురువూ పరితపిస్తుంటారు. విద్యాభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తుంటారు. ఎన్నో వినూత్న ఆవిష్కరణలకు అద్భుత రూపమిస్తుంటారు. విశాఖ జిల్లాలో ఇలాంటి ఉపాధ్యాయులకు కొదవే లేదు. ఈ ఏడాది ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికై జిల్లా ఖ్యాతిని రాష్ట్ర స్థాయిలో ఇనుమడింపజేశారు. మంగళవారం ఏయూలో జరగనున్న కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా అవార్డులు అందుకోనున్నారు. అలాగే జిల్లా స్థాయి అవార్డులకు 60 మంది ఎంపికయ్యారు.

ఇద్దరూ ఇద్దరే..



అప్పలరాజు



మురళీమోహనరావు

తగరపువలస: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా భీమిలి ప్రాంతానికి చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపికయ్యారు. వీరిలో జీవీఎంసీ భీమిలి జోన్ ఒకటోవార్డు బంగ్లామెట్ట ప్రాథమిక పాఠశాలకు చెందిన ప్రధానోపాధ్యాయుడు రెడ్డిపల్లి అప్పలరాజు కాగా మరొకరు చిట్టివలస జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు పొట్నూరు మురళీమోహనరావు. రెడ్డిపల్లి అప్పలరాజు 2016, 2017, 2018లో వరుసగా మూడుసార్లు జీవీఎంసీ ఉత్తమ ఉపాధ్యాయుడు, 2019, 2020లో జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడు అవార్డు పొందారు.

రెడ్డిపల్లి వారింట్లో ఏడుగురు ఉపాధ్యాయులు

పద్మనాభం మండలం రెడ్డిపల్లికి చెందిన రెడ్డిపల్లి సన్యాసిరావు, ఆదిలక్ష్మి దంపతులకు అయిదుగురు మగ సంతానం కాగా వీరంతా ఉపాధ్యాయులే కావడం విశేషం. ఇద్దరు కోడళ్లు కూడా ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతున్నారు. 1998 డీఎస్సీలో శ్రీనివాసరావు, త్రినాథరావు ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించగా 2008 డీఎస్సీలో ప్రసాదరావు, అప్పలరాజు, రమేష్ ఉపాధ్యాయ ఉద్యోగాలు సాధించారు. కోడళ్లలో సుజాత, సంతోషి ఉపాధ్యాయులు కాగా ఒక కోడలు కల్యాణి బీఎస్సీ బీఈడీ పూర్తి చేసి డీఎస్సీ కోసం ఎదురు చూస్తుండగా, మరో కోడలు బ్యాంకు ఉద్యోగిని. పెద్ద కోడలు సుజాత గృహిణి. శ్రీనివాసరావు, త్రినాథరావు, ప్రసాదరావు, రమేష్, సుజాత విజయనగరం జిల్లాలో పనిచేస్తుండగా ఈ ఏడాది రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికైన అప్పలరాజు, సంతోషికుమారి విశాఖ జిల్లాలో పనిచేస్తున్నారు.

ఫణికుమార్ గణితంలో దిట్ట



ఫణికుమార్

ఆరిలోవ: తోటగరువు జెడ్పీ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్రం ఉపాధ్యాయుడు డి.ఫణికుమార్ రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఆయన 1998లో హుకుంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితం స్కూల్ అసిస్టెంట్‌గా చేరారు. అక్కడ నుంచి ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్లారు. అక్కడ నుంచి 2017లో తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వచ్చారు. ఆయన గణితం బోధనతో పాటు సంగీతం, సాహిత్యం, కంప్యూటర్‌లో మంచి పట్టు సాధించారు. విద్యార్థులకు సులభతరంగా బోధించడంలో దిట్ట.

కస్తూర్బా ఉపాధ్యాయినికి అవార్డు



లావణ్య

పద్మనాభం: పద్మనాభం కస్తూర్బా విద్యాలయంలో ఫిజిక్స్ బోధిస్తున్న సీఆర్టీ శొంట్యాన లావణ్య రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. ఆమె ఆనందపురం కస్తూర్బా విద్యాలయం నుంచి బదిలీపై 2022 ఆగస్టు 14న పద్మనాభం కస్తూర్బా విద్యాలయానికి వచ్చారు. ఆమెకు అవార్డు రావడం పట్ల తోటి అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు.

కృషికి దక్కిన ఫలితం



సుశీల్‌కుమార్

అగనంపూడి: రాష్ట్ర ఉత్తమ అధ్యాపకుడిగా అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.సుశీల్ కుమార్ ఎంపికయ్యారు. సివిక్స్ అధ్యాపకుడైన సుశీల్‌కుమార్ ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా గత ఐదేళ్ల నుంచి పనిచేస్తున్నారు. గతంలో విశాఖ మహిళా కళాశాలలో సివిక్స్ అధ్యాపకునిగా పనిచేసి ఇక్కడికి బదిలీపై వచ్చారు. వచ్చిన ఏడాది నుంచే సుశీల్‌కుమార్ తన విశిష్టతను చాటుకుంటూ వస్తున్నారు. గత మూడేళ్ల నుంచి ఇంటర్ ఫలితాల్లో జిల్లా స్థాయిలో ప్రథమంలో కళాశాలను నిలపడంలో సుశీల్‌కుమార్ కృషి, పట్టుదల ఎంతైనా ఉంది.

అధ్యాపకులు	హోదా	పనిచేస్తున్న ప్రాంతం
పి.ఉమామహేశ్వరరావు	సంస్కృతం అధ్యాపకుడు	వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల
గట్టు రాజుకుమార్	కామర్స్ అధ్యాపకుడు	వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల
పలుకుర్తి మేరీ అనుపమ	బయోకెమిస్ట్రీ విభాగాధిపతి	సెయింట్ జోసెఫ్ మహిళా కళాశాల
ఎస్.సత్యనారాయణ	తెలుగు అధ్యాపకుడు	సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల
ఎన్.కిశోర్‌బాబు	ప్రొఫెసర్	కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం (ఏయూ)
పి.శ్యామల	ప్రొఫెసర్	రసాయన శాస్త్ర విభాగాధిపతి (ఏయూ)
సి.వి.నాయుడు	ప్రొఫెసర్	వాతావరణ సముద్ర శాస్త్రం (ఏయూ)
కె.సీతామాణిక్యం	ప్రొఫెసర్	న్యాయశాస్త్ర విభాగం (ఏయూ)
కె.రమాసుధ	ప్రొఫెసర్	ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ విభాగం (ఏయూ)
డి.లలితభాస్కరి	ప్రొఫెసర్	కంప్యూటర్ సైన్స్, సిస్టమ్స్ ఇంజినీరింగ్ (ఏయూ)

సర్వేపల్లి నడయాడిన నేల



ఏయూక్యాంపస్ : ఉపాధ్యాయ వృత్తికే వన్నెతెచ్చిన వ్యక్తి సర్వేపల్లి రాధాకృష్ణన్. గురువులకే గురువుగా ఆయనను పూజిస్తాం. ఆయన జయంతి సందర్భంగా ఏటా సెప్టెంబర్ 5వ తేదీన ఉపాధ్యాయ దినోత్సవంగా జరుపుకుంటున్నాం. అటువంటి మహనీయుడు నడయాడిన నేల ఆంధ్ర విశ్వవిద్యాలయం. వ్యవస్థాపక ఉపకులపతిగా పనిచేసిన కట్టమంచి రామలింగారెడ్డి తన తరువాత ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని నడిపించే సమర్థత కలిగిన వ్యక్తి కోసం అన్వేషించారు. ఈ ప్రయాణంలో ఆయన దృష్టి సర్వేపల్లి రాధాకృష్ణన్‌పై పడింది. సర్వేపల్లిని ఒప్పించి వర్సిటీకి ద్వితీయ ఉపకులపతిగా విశాఖకు తీసుకువచ్చారు. ఏయూ ఉపకులపతిగా 1931 నుంచి 1936 వరకు సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలు అందించారు. ఆయన విశ్వవిద్యాలయంలో ఒక క్రమబద్ధమైన విధానాలు అమలు జరిపారు. దేశ విదేశాల నుంచి ఆచార్యులను ఆహ్వానించడం, విద్యార్థులకు స్ఫూర్తిదాయక ప్రసంగాలు ఏర్పాటు చేయడం వంటి కార్యక్రమాలు జరిపారు. ఆయన హయాంలోనే 1932లో ఏయూలో తత్వశాస్త్ర విభాగం ప్రారంభించారు. ఆయనే స్వయంగా ఏయూ తత్వశాస్త్ర విభాగంలో పాఠాలను సైతం బోధించారు. పరిపాలన బాధ్యతలు ఉన్నప్పటికీ ఆయన బోధనకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చేవారు. ఏయూ నుంచి వెళ్లిన తరువాత ఆయన ఉపరాష్ట్రపతిగా, రాష్ట్రపతిగా అత్యున్నత పదవులను అలంకరించారు. ఆయన స్ఫూర్తిని నేటి తరానికి అందిస్తూ, ఆయన జ్ఞాపకాలను భవిష్యత్ తరాలను చేరువ చేసే విధంగా ఏయూ ఆర్ట్స్ కామర్స్ కళాశాల వద్ద సర్వేపల్లి రాధాకృష్ణన్ నిలువెత్తు విగ్రహాన్ని ఏయూ అధికారులు ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం 8.30 గంటలకు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాల వేసి గురుపూజోత్సవంలో పాల్గొంటారు.

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే... IIలో

భీమిలిలో భీమా సందడి


షూటింగ్ లొకేషన్‌లో హీరో గోపీచంద్

కొమ్మాది: ప్రముఖ నటుడు గోపీచంద్, రెడ్ సినిమా ఫేమ్ మాళవిక శర్మ హీరో, హీరోయిన్లుగా నటిస్తున్న భీమా సినిమాకు సంబంధించిన కొన్ని సన్నివేశాలను భీమిలి బీచ్‌లో సోమవారం చిత్రీకరించారు. హీరో గోపీచంద్, నాజర్‌పై సన్నివేశాలను షూట్ చేశారు. కన్నడ దర్శకుడు నిమ్మ హర్ష తెరకెక్కిస్తున్న ఈ సినిమాలో రఘుబాబు, చమ్మక్ చంద్ర తదితరులు నటిస్తున్నారు. ఈ చిత్రానికి కె.కె.రాధా మోహన్ నిర్మాత కాగా, రవి బస్రూరు సంగీతం అందిస్తున్నారు. గోపీచంద్‌ను చూసేందుకు పెద్ద ఎత్తున స్థానికులు షూటింగ్ లొకేషన్‌కు చేరుకున్నారు.

'ఖుషి'గా రూ.కోటి కానుక


ఖుషి విజయోత్సవంలో పాల్గొన్న హీరో విజయ్ దేవరకొండ, దర్శకుడు శివ, చిత్ర యూనిట్

- వంద మందికి రూ.లక్ష చొప్పున అందిస్తా..
- ఖుషి విజయోత్సవ సభలో హీరో విజయ్ ప్రకటన

బీచ్‌రోడ్డు: తన సంపాదన నుంచి అభిమానులకు కోటి రూపాయలను కానుకగా అందిస్తానని హీరో విజయ్ దేవరకొండ ప్రకటించారు. ఖుషి చిత్రం విజయోత్సవ సభను సోమవారం గురజాడ కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ ఖుషి సినిమా ఘన విజయం సాధించిన నేపథ్యంలో తనను అభిమానించే కుటుంబాలు కూడా సంతోషంగా ఉండాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఇందు కోసం ఓ ఫారం విడుదల చేస్తానని, డబ్బులు అవసరం అనుకున్న వారు ఈ ఫారం నింపి పంపించాలని సూచించారు. వచ్చిన దరఖాస్తుల్లో వంద మందిని ఎంపిక చేసి ఒక్కొక్కరికి రూ.లక్ష చొప్పున అందజేస్తానని చెప్పారు. అభిమానులు చూపించే ప్రేమ చాలా గట్టిగా తగులుతుందన్నారు. ఫేక్ రేటింగ్‌లు, ఫేక్ రివ్యూలు దాటుకుని ఖుషి సినిమా విజయం సాధించడానికి వారే కారణమన్నారు. మూడు రోజులుగా అభిమానుల ముఖంలో చిరునవ్వులతో తాను చాలా ఖుషీగా ఉన్నానని చెప్పారు. ఇప్పటి వరకు డబ్బు, కుటుంబం కోసం పని చేశానని, ఇక నుంచి ఫ్యాన్స్ సంతోషం కోసం పనిచేస్తానన్నారు. 'నాకు ఖుషి మీరు కనబడితే.. నాకు ఖుషి మీ అరుపులు వినబడితే' అంటూ పాట పాడి అభిమానుల్లో హుషారెత్తించారు. దర్శకుడు శివ నిర్వాణ మాట్లాడుతూ అర్జున్‌రెడ్డి చిత్రం చూసిన తర్వాత ఆర్.కె.బీచ్‌లో నడుచుకుంటూ విజయ్‌తో సినిమా చేయాలని కలగన్నానని, అది ఖుషితో నెరవేరిందన్నారు. ప్రేమలో అభిప్రాయాలు, మతాలు, కులాలు అనే తేడా ఉండొచ్చు గానీ.. మనుషులంతా ఒక్కటే అనే సందేశంతో ఈ సినిమా రూపొందించినట్లు చెప్పారు. కుటుంబం మొత్తం చూసే సినిమా ఖుషి అన్నారు. సభలో సంగీత దర్శకుడు హేషామ్ అబ్దుల్ వహాబ్, నిర్మాతలు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే

టీచర్ పేరు	హోదా	స్కూల్ పేరు, మండలం
బి.అప్పలరాజు	హెచ్ఎం	జెడ్పీహెచ్ఎస్, బీఆర్ తాళ్లవలస
ఆర్.సన్యాసిరావు	హెచ్ఎం	జెడ్పీహెచ్ఎస్, గొట్టిపల్లి
ఎల్ఎస్ఎన్ పాత్రుడు	హెచ్ఎం	జెడ్పీహెచ్ఎస్, గిడిజాల
ఎం.వి.కృష్ణకుమార్	హెచ్ఎం	జెడ్పీహెచ్ఎస్, అనంతవరం
జి.పైడిరాజు	హెచ్ఎం	జెడ్పీహెచ్ఎస్, లక్ష్మీపురం
ఎల్.అరుణకుమారి	హెచ్ఎం	జీవీఎంసీ, మాల్కాపురం
కె.శ్రీనివా రావు	హెచ్ఎం	జీవీఎంసీహెచ్ఎస్, ప్రకాష్‌రావు పేట
బి.కె.రమేష్	ప్రిన్సిపాల్	శ్రీకృష్ణాపురం గురుకులం
కె.రాంబాబు	ప్రిన్సిపాల్	ఏపీఆర్ఎస్,భీమిలి
ఎం.చంద్రకళ	ప్రిన్సిపాల్	కేజీబీవీ, ఆనందపురం
ఎస్.సంధ్యారాణి	స్కూల్ అసిస్టెంట్	జీక్యూఎంజీ హెచ్ఎస్, విశాఖపట్నం
జె.మాధవి	లెక్చరర్	గవర్నమెంట్ డైట్, భీమిలి
ఎస్.రామారావు	స్కూల్ అసిస్టెంట్	గవర్నమెంట్ హెచ్ఎస్, పెందుర్తి
ఎం.మెర్సీ పమెళ	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్, మింధి
ఎ.స్వామి నాయుడు	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్, తోటగరువు
ఎం.విశ్వేశరరావు	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్, సరిపల్లి
జె.లక్ష్మీనారాయణ	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్, వేపగుంట
ఎస్.త్రినాథరావు	లెక్చరర్	గవర్నమెంట్ డైట్, భీమిలి
వి.వి.జానకిరామ్	స్కూల్ అసిస్టెంట్	జీవీఎంసీ, మాధవధార
జె.భానుసుందరి	స్కూల్ అసిస్టెంట్	ఎంవీడీహెచ్ఎస్, దండుబాజర్
జె.శ్రీనివాసరామసురేష్	స్కూల్ అసిస్టెంట్	కేడీపీఎం, చిన్నవాల్తేరు
డి శ్యామల	స్కూల్ అసిస్టెంట్	జీవీఎంసీ, ప్రకాష్‌రావు పేట
బి.విజయకుమారి	స్కూల్ అసిస్టెంట్	అంబేద్కర్ గురుకులం, మేహాద్రిగెడ్డ
ఎం.వి.పద్మజ	స్కూల్ అసిస్టెంట్	ఎంసీహెచ్ఎస్, శ్రీహరిపురం
అగ్రిస్ అనేందిని	స్కూల్ అసిస్టెంట్	సేక్రెడ్ హార్ట్ హెచ్ఎస్, జ్ఞానాపురం
పి.సుగుణవతి	స్కూల్ అసిస్టెంట్	హెచ్ఎస్‌జేసీహెచ్ఎస్, గాంధీగ్రామ్
ఎస్.సుజాతకుమారి	స్కూల్ అసిస్టెంట్	పీఎస్ఆర్ఎం, భీమిలి
డి.నరసింహామూర్తి	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్, పెదగంట్యాడ
కె.కనకరాజు	స్కూల్ అసిస్టెంట్	ఆర్‌బీఎం యూపీ స్కూల్, జీవీఎంసీ
బి.దివాకర్‌రావు	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్,గాజువాక
బి.నాగమోహన్‌రావు	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్, కణితి
యు.నీరజ	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్, ఎస్ఎస్ కాలనీ, చినగదిలి
సిహెచ్ వెంకటరెడ్డి	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్ఎస్, చింతలవలస, భీమిలి
కె.అన్నపూర్ణ	స్కూల్ అసిస్టెంట్	జెడ్పీహెచ్, వాడపాలెం
ఎల్.కనకేశ్వరరావు	ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం	ఎంపీపీ స్కూల్, మజ్జివలస
బి.వెంకటలక్ష్మి	స్కూల్ అసిస్టెంట్	ఎస్ఎస్‌పీవీ స్కూల్, భీమిలి

ఎస్జీటీ ఉత్తమ ఉపాధ్యాయులు

వి.సరస్వతి (బుచ్చిరాజుపాలెం), వి.పరమేశ్వరరావు (ఇంద్రనగర్), వి.కృష్ణవేణి (రామచంద్రనగర్), ఎస్.ఒలివియా (యల్లపువానిపాలెం), ఎం.సుశీల (దుర్గావానిపాలెం), సీహెచ్ సోని లావణ్య(బాలచెరువు), ఎస్‌వీఎస్ఎస్ఎల్ఎన్ మూర్తి(దిబ్బపాలెం), ఆర్.గణపతి (తలారివానిపాలెం), ఎ.కనకమహాలక్ష్మి (కొత్తశాలిపేట పీఎస్, మహారాణిపేట), సీహెచ్ నందగోపాల్ (చెంగలరావుపేట పీఎస్, మహారాణిపేట), యు.రాంబాబు (జీవీ ఆగ్రహారం), సిరిపురపు శ్రీనివాసరావు (పురుషోత్తపురం), సీహెచ్ రాజ్‌కుమార్ (పెదజాలరిపేట), ఎం.సూర్యకళ (దువ్వాడ), బి.మధుమతి (యర్లవానిపాలెం), డి.పైడిరాజు(విలక్షణపాలెం), కె.సన్యాసినాయుడు (కోరాడ), జె.కమలాదేవి(అన్నంపేట), ఎస్.రోజా (తోటగరువు), జి.శ్రీను(బుచ్చిరాజుపాలెం), బీహెచ్ లక్ష్మి (సారిపల్లి), ఎస్.విజయ్‌కుమార్ (జగ్గయ్యపాలెం), ఎస్.శ్రీనివాసరావు (పురుషోత్తపురం), షబానా సిరాజ్ (తోటగరువు), వి.వాణిజయ ప్రభ (సంతపాలెం)

తెలుగును ప్రేమించి.. ప్రోత్సహిద్దాం

- మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు


తెలుగుభేరి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న వెంకయ్యనాయుడు

తాటిచెట్లపాలెం: ప్రతి ఒక్కరూ తెలుగును ప్రేమించి.. ప్రోత్సహించి.. భాష ప్రాధాన్యాన్ని భావితరాలకు తెలియజేయాలని మాజీ ఉపరాష్ట్రపతి ఎం. వెంకయ్యనాయుడు పిలుపునిచ్చారు. ద్వారకానగర్‌లోని పౌరగ్రంథాలయంలో తెలుగుదండు ఆధ్వర్యంలో సోమవారం తెలుగుభేరి పుస్తకాన్ని ఆవిష్కరించి, మాట్లాడారు. తెలుగు భాషలో పద్యాలు, సాహిత్యం, గేయాలు, రచనలకు చాలా ప్రాముఖ్యముందన్నారు. వారసత్వం అంటే ఆస్తి కాదని.. జన్మభూమి, మాతృభాష, కన్నతల్లి నిజమైన వారసత్వ ఆస్తులన్నారు. తెలుగు పద్యాలను చదవడం వలన జ్ఞాపకశక్తి, భాషా పరిజ్ఞానం మరింత పెరుగుతుందన్నారు. మాతృభాష కళ్ల లాంటిదని, పరభాష కళ్లజోడులాంటిదన్నారు. కళ్లజోళ్లను ఎన్నయినా మార్చవచ్చు కానీ కళ్లను మార్చలేమన్నారు. విద్యార్థి స్థాయి నుంచే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాతృభాషను ప్రోత్సహించాలన్నారు. ఎనిమిదో తరగతి వరకు మాతృభాషలో విద్యాభ్యాసం ఉండాలని అభిప్రాయపడ్డారు. తనకు తెలుగు అన్నా, తెలుగు సంస్కృతి అన్నా ఎనలేని ప్రేమ, అభిమానం అని తెలిపారు. మాతృభాషను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రసార సాధనాలపై ఉందన్నారు. తెలుగుభేరి పుస్తక రచయిత పరవస్తు సూరిని అభినందించారు. కార్యక్రమంలో విజయ్‌నిర్మాణ్ కంపెనీ అధినేత సూరపనేని విజయ్‌కుమార్, శ్రీవిశ్వ విజ్ఞాన ఆధ్యాత్మిక పీఠం ప్రతినిధి డాక్టర్ ఉమర్ ఆలీషా, పలువురు కవులు పాల్గొన్నారు.

'నిబంధనల మేరకు వీఎల్‌టీ విధించండి'


ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్, జీవీఎంసీ కమిషనర్

డాబాగార్డెన్స్: జీవీఎంసీలో ఖాళీ భూమి పన్ను(వీఎల్‌టీ) విధింపు, వసూలులో అవినీతి జరుగుతోందని ఓ కార్పొరేటర్ మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మకు ఫిర్యాదు చేశారు. జీవీఎంసీ ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి 91 ఫిర్యాదులు వచ్చాయి. నిబంధనల మేరకు వీఎల్‌టీ విధించి, వసూలు చేస్తే జీవీఎంసీకి వందల కోట్ల ఆదాయం వస్తుందని ఆ వినతిలో పేర్కొన్నారు. జీవీఎంసీ రెవెన్యూ విభాగం అలసత్వం కారణంగా దుకాణాలు, కల్యాణ మండపాలు, ఆశీల బకాయిలు వంద కోట్లకు పైగా పేరుకుపోయాయన్నారు. అందుకు పాతనగరంలోని హోల్‌సేల్ ఫ్రూట్ మార్కెట్ వ్యవహారమే ప్రత్యక్ష ఉదాహరణ అని చెప్పారు. ఈ సందర్భంగా మేయర్, కమిషనర్ మాట్లాడుతూ జగనన్నకు చెబుదాంలో వచ్చిన ఫిర్యాదులను మూడు రోజుల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అదనపు కమిషనర్లు వై.శ్రీనివాసరావు, వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళికాధికారి సునీత, ప్రధాన ఇంజినీర్ రవికృష్ణరాజు, ప్రధాన వైద్యాధికారి నరేష్‌కుమార్, డీసీపీ నరేంద్రరెడ్డి, కార్యదర్శి పి.నల్లనయ్య, డీసీ ఫణిరామ్, డీడీ(హార్టికల్చర్) దామోదరరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరావు పాల్గొన్నారు.

పోలీస్ స్పందనకు 48 వినతులు

దొండపర్తి: స్పందనలో వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని డీసీపీ(క్రైం) జి.నాగన్న పోలీస్ అధికారులను ఆదేశించారు. పోలీస్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 48 ఫిర్యాదులు వచ్చాయి. డీసీపీ ఫిర్యాదులు స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటిపై సంబంధిత అధికారులతో మాట్లాడి సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ(ఎస్‌బీ) ఇ.నాగేంద్రుడు, లీగల్ అడ్వైజర్ పి.వి.రామకృష్ణతో పాటు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఏసీపీలు, అన్ని పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సులో ప్రవేశాలకు 30 వరకు గడువు

మహారాణిపేట: జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ట్రైనింగ్ సెంటర్లలో మల్టీపర్పస్ హెల్త్ వర్కర్(ఫీమేల్)/ఏఎన్ఎం కోర్సులో ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించడానికి, దరఖాస్తులు సమర్పించడానికి ఈ నెల 30వ తేదీ వరకు అవకాశం ఉందని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు తెలిపారు. పూర్తి వివరాలకు https://cfw.ap.nic.inను సందర్శించాలని కోరారు.

అర్జీల సత్వర పరిష్కారం: కలెక్టర్


వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ మల్లికార్జున

మహారాణిపేట: జగనన్నకు చెబుదాం(స్పందన) అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జగనన్నకి చెబుదాంలో ప్రజల నుంచి వచ్చే అర్జీలను నిర్దేశిత సమయంలోగా పరిష్కరించాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ కాకూడదని స్పష్టం చేశారు. కాగా.. జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి మొత్తం 172 వినతులు అందాయి. ఇందులో రెవెన్యూ శాఖకు సంబంధించి 71, జీవీఎంసీ 39, పోలీసు 21, ఇతర శాఖలకు చెందిన 41 వినతులు ఉన్నాయి. జాయింట్ కలెక్టర్ కె.ఎస్.విశ్వనాథన్, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మార్కెట్‌లోకి 'హోండా ఎలివేట్' విడుదల


హోండా ఎలివేట్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

ఎంవీపీకాలనీ: సరికొత్త హోండా ఎలివేట్ కారు విశాఖ మార్కెట్‌లోకి విడుదలైంది. లాసన్స్ బే కాలనీలోని సెంట్రల్ హోండా షోరూంలో అతిథులు అన్నంరాజు సత్యనారాయణమూర్తి, వైఎస్ రవీంద్రనాథ్‌రెడ్డి, రాజీవ్ ధావన్, సంజీవ్ ధావన్‌తో పాటు డీలర్ కుమార్ ముప్పిడి ఈ కారును ఆవిష్కరించారు. ప్రముఖ వాహన తయారీ సంస్థ హోండా ఆధునాతన ఈ మోడల్‌ను రూపొందించింది. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ఎలివేట్ కారును హోండా సంస్థ తొలిగా భారత్ విపణిలోనే విడుదల చేయడం జరిగిందన్నారు. అంతర్జాతీయ దృక్పథంతో కస్టమర్లను ఆకర్షించే విధంగా ఈ వాహనాన్ని రూపొందించినట్లు తెలిపారు. చురుకుదనం, సౌకర్యం, ఇంటీరియర్ అంశంలో ఎలివేట్ ప్రత్యేకంగా తయారు చేయబడిందన్నారు. భద్రత విషయంలోను ఆధునాతన సెన్సింగ్ వ్యవస్థను కలిగివున్నట్లు వెల్లడించారు. ఆరు కలర్స్‌లో లభించనుండగా రూ.11 లక్షల నుంచి ప్రారంభ ధర ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆరోగ్య, సంక్షేమ కార్యక్రమాలపై ప్రత్యేక శ్రద్ధ

- డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: ఆరోగ్య, సంక్షేమ కార్యక్రమాల అమలులో ఆశా నోడల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు అన్నారు. సోమవారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఆశా నోడల్ అధికారులతో పలు ఆరోగ్య కార్యక్రమాల అమలుపై జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. కంటి వెలుగు స్క్రీనింగ్ క్యాంపుల నిర్వహణ, వ్యాధి నిరోధక టీకాలు వేయడం, గర్భిణుల గుర్తింపులో ప్రత్యేక శ్రద్ధతో విధులు నిర్వహించాలని సూచించారు. సర్వేలు పక్కాగా చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు వైద్యులు,ప్రోగ్రాం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌చే 'రాజన్న ఆటోనగర్'కు శంకుస్థాపన

- అదే మా అందరి కోరిక
- స్మార్ట్ విశాఖ ఆటోపార్ట్స్ యూనియన్, స్క్రాప్ డీలర్లు


కలెక్టర్ మల్లికార్జునకు వినతి పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

మహారాణిపేట: ఆనందపురం మండలం కనుమాంలో రాజన్న ఆటోనగర్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా శంకుస్థాపన జరగాలన్నదే తమ కోరికని స్మార్ట్ విశాఖ ఆటోపార్ట్స్ యూనియన్, స్క్రాప్ డీలర్ల అధ్యక్షుడు పి.ఖాజా వలీ, కార్యదర్శి వై.సత్యనారాయణ అన్నారు. దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ ఆధ్వర్యంలో యూనియన్ నాయకులు సోమవారం కలెక్టర్ ఎ.మల్లికార్జునను కలిశారు. ఈ స్థలానికి సంబంధించి అన్ని పనులు పూర్తయ్యాయని, దీనిపై 2,500 కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని చెప్పారు. సుమారు 15వేల మంది సభ్యుల సమక్షంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ఆటోనగర్‌కు శంకుస్థాపన జరగాలన్నదే అందరి కోరిక అని అన్నారు. వెంకటేశ్వర మెట్టపై ఉన్న శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి, అంగడి దిబ్బ స్థలానికి ప్రత్యామ్నాయ భూములను కేటాయించాలని ఎమ్మెల్యే కలెక్టర్‌ను కోరారు.

పవర్ హాలిడేలో వెసులుబాటు కల్పించాలి


మాట్లాడుతున్న వాసీవా అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్

అక్కిరెడ్డిపాలెం: పవర్‌హాలిడే కారణంగా పలువురు పారిశ్రామిక వేత్తలు ఇబ్బందులు ఎదుర్కోవలసి వస్తుందని, కొన్ని పరిశ్రమలకు వెసులుబాటు కల్పించాలని ఆటోనగర్‌లోని విశాఖ ఆటోనగర్ స్మాల్ స్కేల్ ఇండస్ట్రీయలిస్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (వాసీవా) అధ్యక్షుడు సజ్జా పాండురంగ ప్రసాద్ అన్నారు. ఏపీఈపీడీసీఎల్ ప్రకటించిన పవర్ హాలీడేపై వాసీవా భవనంలో పలువురు పారిశ్రామికవేత్తలతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకటించిన విద్యుత్ నియంత్రణతో పరిశ్రమలకు తీవ్ర నష్టం జరుగుతుందని చెప్పారు. ఎంప్లాయిమెంట్‌పై దీని ప్రభావం పడుతుందని తెలిపారు. ఉదయం 6 నుంచి సాయంత్రం 6 వరకు మాత్రమే విద్యుత్ వినియోగం కారణంగా కొన్ని పరిశ్రమలు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. బల్క్ డ్రగ్ పరిశ్రమలు, ఫార్మాస్యూటికల్ పరిశ్రమలు, మెడికల్ ఆక్సిజన్ ఉత్పత్తి చేసే పరిశ్రమలు, రైస్ మిల్లులకు ఆర్ అండ్ సీ పద్ధతుల నుంచి మినహాయింపు ఇవ్వడం సంతోషదాయకమన్నారు. కానీ కొన్ని రకాల పరిశ్రమల్లో బ్రాయిలర్స్ కూలింగ్ అవడానికి, హీటవడానికి విద్యుత్ వినియోగం అవసరమన్నారు. ఇలాంటి పరిశ్రమలకు వెసులు బాటు కల్పించాలని కోరారు. ఈ సమావేశంలో పారిశ్రామిక వేత్తలు శేషగిరిరావు, పర్చూరి ప్రభాకర్, అశోక్, చీకటి సత్యనారాయణ, కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

'గిన్నిస్ బుక్'లో ప్రొ. తేజేశ్వరరావుకు చోటు



ధ్రువపత్రాన్ని స్వీకరిస్తున్న తేజేశ్వరరావు

అక్కిరెడ్డిపాలెం: గాజువాకలోని ఎంవీఆర్ డిగ్రీ, పీజీ కళాశాల అసోసియేట్ ప్రొఫెసర్ పూణ్ణ తేజేశ్వరరావు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. ప్రపంచంలోనే అతిపెద్ద పుస్తక రచనలో ఆయన భాగమయ్యారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ వి.రామారావు ఆయన్ని అభినందించారు. కళాశాలలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.బాలకృష్ణ మాట్లాడారు. తమిళనాడుకు చెందిన ఈఎస్ఎన్ పబ్లికేషన్ సంస్థ 1,00,100 పేజీలతో 19.34 అడుగుల ఎత్తు కలిగిన వరల్డ్ 2023 వైడ్ అవుట్ కం ఆన్ రీసెర్చ్ అండ్ లేటెస్ట్ డెవలప్‌మెంట్ అనే పుస్తకాన్ని తీసుకొచ్చిందన్నారు. ఈ పుస్తకంలో తేజేశ్వరరావు 25 చాప్టర్స్‌ను రచించినట్లు చెప్పారు. తేజేశ్వరరావు అరుదైన ఘనత సాధించడంపై సంతోషం వ్యక్తం చేశారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వి.ఎస్.కృష్ణారావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది ప్రొఫెసర్‌ను అభినందించారు.

తండ్రి మందలించాడని డిగ్రీ విద్యార్థి ఆత్మహత్య


దూడ రాజు మృతదేహం

తగరపువలస: తండ్రి మందలించాడన్న మనస్తాపంతో భీమిలి ఎగువపేటకు చెందిన బీకాం సెకెండ్ ఇయర్ విద్యార్థి దూడ రాజు(20) ఆదివారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. చెడు వ్యసనాలకు బానిస అయిన కుమారుడిని ఇటీవల తండ్రి సూకరాజు మందలించాడు. దీంతో మనస్తాపానికి గురై ఈ అఘాయిత్యానికి పాల్పడినట్టు తండ్రి భీమిలి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గతంలో మందలించినప్పుడు కూడా రెండు సార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు తండ్రి ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఎస్ఐ భరత్ కుమార్‌రాజు కేసు దర్యాప్తు చేస్తున్నారు.